# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 14 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## షేక్ హసీనాపై హత్య కేసు

బలగం టీవి, హైదరాబాద్

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనాపై హత్య కేసు నమోదైంది. హింసాత్మక నిరసనల కారణంగా ఓ కిరాణా దుకాణం యజమాని మరణానికి ఆమె కూడా కారణమని పేర్కొంటూ ఈ కేసు నమోదైంది. ఆమెతో పాటు ఆరుగురు వ్యక్తులను కూడా పోలీసులు ఈ కేసులో ముద్దాయిలుగా చేర్చారు. వారిలో అవామీ లీగ్ పార్టీ ముఖ్యనేతలు ఉన్నారు. నిరసనలకు సంబంధించి షేక్ హసీనాపై నమోదైన తొలి కేసు ఇదే కావడం గమనార్హం. రిజర్వేషన్ల రద్దుకు అనుకూలంగా జులై 19న ముహమ్మద్‌పూర్‌లో ఆందోళన జరిగింది. అయితే నిరసనకారులపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో అబూ సయ్యద్ అనే కిరాణా దుకాణం యజమాని ప్రాణాలు కోల్పోయాడు. దాంతో చనిపోయిన వ్యక్తి సన్నిహితుడు ఈ కేసు పెట్టారు. షేక్ హసీనాతో పాటు అవామీ లీగ్ జనరల్ సెక్రటరీ ఒబైదుల్లా, మాజీ హెూం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్, మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చౌదరి అబ్దుల్లా అల్ మామున్ కూడా కేసులో ఉన్నారు. ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో 300లకు పైగా పౌరులు మృత్యువాతపడ్డారు. రాజీనామా చేసిన వెంటనే భారత్‌కు వచ్చి తాత్కాలిక ఆశ్రయం పొందుతున్నారు.






# దేశవ్యాప్తంగా కదంతొక్కిన వైద్యులు

- కోల్‌కతాలో లైంగికదాడి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్
- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి
- 'నో సేఫ్టీ.. నో డ్యూటీ' అంటూ నినాదాలు

బలగం టీవి, హైదరాబాద్

పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా లో ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలిపై లైంగికదాడి హత్య ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఘటనను నిరసిస్తూ వైద్యులు ఆందోళన బాట పట్టారు. . ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానల రెసిడెంట్ డాక్టర్లు ఢిల్లీ, కోల్‌కతా, రాజస్థాన్, యూపీ సహా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ కోరుతున్నారు.

వైద్యుల సమ్మెతో దవాఖానల్లో పలు వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ఓపీ సేవలు, అత్యవసరం కాని సర్జరీలు నిలిచిపోయాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల కొద్దీ ఆసుపత్రుల ముందు క్యూలో నిల్చున్నా ఫలితం లేకుండా పోయింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు వైద్యుల సమ్మెతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్యుల సమ్మెకు అర్థం ఉందని.. మరి మా పరిస్థితి ఏంటని వాపోతున్నారు.

ఇదిలా ఉండగా వైద్యులు 'నో సేఫ్టీ.. నో డ్యూటీ' అంటూ నినాదాలు చేశారు. అత్యవసర సేవలు మినహా విధులకు తిరిగి హాజరయ్యేందుకు నిరాకరిస్తున్నారు. దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నారు. దీంతో పలు నగరాల్లో ఓపీ సేవలకు అంతరాయం ఏర్పడింది. కాగా ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఎంపిక చేసిన సేవలకు దూరంగా ఉంటామని సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. కోల్‌కతాలో వైద్యురాలి హత్య చరిత్ర అత్యంత అవమానకరమైన ఘటన అని, వైద్యులకు తగిన భద్రత కల్పించాలంటూ కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాకు అసోసియేషన్ ఒక లేఖ కూడా రాసింది.డ్యూటీలో ఉన్న మహిళా వైద్యురాలి హత్య ఘటనకు బాధ్యులైన అధికారులు అందరూ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. నిరసన తెలుపుతున్న వైద్యులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని, ఈ కేసులో సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వాలని అని కూడా విజ్ఞప్తి చేసింది. కాగా వైద్యుల ఆందోళన తీవ్ర కోల్‌కతా నగరంలో ఎక్కువగా ఉంది.

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలోని కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్శిటీలో వైద్యులు నిరసనకు దిగడం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. నిరసన తెలుపుతున్న వైద్యులు ఇవాళ ఉదయం గుమిగూడి సేవలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. అయితే చికిత్స అందించాలని రోగులు, వారి బంధువులు డిమాండ్ చేశారు. దీంతో అక్కడి ఒక్కసారిగా ఆందోళనకర వాతావరణం నెలకొంది. కొందరు రోగుల బంధువులు వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ మూసి ఉన్న ఓపీడీ గది తలుపులు బద్దలుకొట్టారు.

### వసతి గృహాలలో
## ఏసీబీ ఆకస్మిక తనిఖీలు



బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా పది ప్రభుత్వ వసతి గృహాలలో ఎసిబి అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఏకకాలంగా వివిధ చోట్ల హాస్టల్‌లో వేర్వేరుగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీలలో విస్తుపోయే నిజాలు బయటపెట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ బిసి సంక్షేమ వసతి గృహంలో తనిఖీలు చేయగా అక్కడి దుస్థితి బయట పడింది. ఎసిబితో సహా ఆహార భద్రత, శానిటరీ, ఆడిట్ అధికారులు వసతి గృహంలో తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు అందించే ఆహారం అపరిశుభ్ర వాతావరణంలో వండుతున్నారని, వంట సరుకులు సైతం వండే పరిస్థితిల్లో లేవవి నాసిరకంగా ఉన్నాయని ఎసిబి డిఎస్పి కృష్ణగౌడ్ వెల్లడించారు. మెనూ ప్రకారం భోజనం వండటం లేదని, విద్యార్థులకు అందా ల్సిన స్వీట్లు, అరటి పండు, కోడి గుడ్లు కూడా అందించడంలేదని తెలిపారు. హాస్టల్ పరిసర ప్రాంతమంతా శుభ్రంగా లేదని, మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా చాలారోజులుగా శుభ్రపరచుకుండా ఉంచినట్లు వివరించారు. రిజిస్టర్‌లో 120 మంది విద్యార్థులు ఉన్నట్లుగా నమోదు చేసినా వాస్తవంగా అక్కడ 80 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

ఉదయం 6 గంటల తర్వాత తనిఖీలు జరిగిన సమయంలో వార్డెన్ కూడా అందుబాటులో లేరని, ఫోన్ స్విచ్చాప్ చేసుకున్నారని చెప్పారు. జిల్లా కేంద్రంలోని బిసి సంక్షేమ శాఖ అధికారులను పిలిపించి విచారణ జరిపామని తెలిపారు.ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గాంధీనగర్ ఐటిడిఏ పరిధిలోని గురుకుల పాఠశాలలో ఎసిబి డిఎస్పి రమేష్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ఈ గురుకులాల్లో 680 విద్యార్థులు ఉండగా పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో డిఎస్పి అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల విద్యుత్ తీగల ప్రమాదకరంగా ఉన్నాయని, విద్యార్థులు ఉంటున్న గదుల బాత్రూంలకు తలుపులు కూడా సరిగా లేవని అసహనం వ్యక్తం చేశారు. అలాగే హైదరాబాద్ ప్రభుత్వ వసతి గృహాల్లోనూ ఎసిబి అధికారులు

మిగితా 2వ పేజీలో

# రేపు సీతారామ ప్రాజెక్టు ప్రారంభం



- 3 పంపులు ప్రారంభిస్తున్నాం
- ప్రాజెక్టు మొత్తాన్ని మరో రెండేండ్లలో నిర్మిస్తాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి -

బలగం టీవి, హైదరాబాద్

ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టు 3 పంపులను ప్రారంభిస్తున్నామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు రూ.7,436 కోట్లు ఖర్చు చేసి, ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. నీటి పారుదల శాఖను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. జలసౌధలో మంత్రి పొంగులేటితో పాటు ఉత్తమ్‌కుమార్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టును మరో రెండేళ్లలో సంపూర్ణంగా పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టు పంపులను ప్రారంభిస్తామని మిగిలిన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు.

పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్? పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేదని కమిషన్ల కక్కుర్తి కోసం రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులు, పేర్లు మార్చి అంచనాలు కూడా పెంచారని మంత్రి మండిపడ్డారు. కాళేశ్వరం అంచనాలు పెంచినట్లే సీతారామ ఎత్తిపోతల అంచనాలు కూడా భారీగా పెంచారని, కేసీఆర్ నిర్లక్ష్యంతో ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ ఏపీలోకి వెళ్లిందని ఆరోపించారు. రూ.2000 కోట్లు అప్పటికే అయిన ఖర్చుకు అదనంగా మరో రూ.1500 కోట్లు ఖర్చు చేసి ఉంటే ఇందిరా, రాజీవ్ సాగర్ పనులు పూర్తయ్యేవని తెలిపారు.

రీడిజైనింగ్‌లో మరో ఘోర తప్పిదం చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సీతారామ ప్రాజెక్టు చేపట్టడం తప్పుడు నిర్ణయమని, కాంగ్రెస్?కు మంచి పేరు వస్తుందన్న దుర్బుద్ధితో రీఇంజనీరింగ్ చేశారని పేర్కొన్నారు. 90 శాతం ప్రాజెక్టు పనులు తామే పూర్తి చేశామని మాజీమంత్రి హరీశ్? రావు చెప్పడం హాస్యాస్పదమన్న ఉత్తమ్ సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం తుది అనుమతులు ఇవాళ్టి వరకు కూడా రాలేదని, బెనిఫిట్ కాస్ట్ రేషియో విషయంలో కూడా బీఆర్ఎస్? అనుమతులు పొందలేదని పేర్కొన్నారు.

తాము నిరంతరం ఫాలో అప్ చేసి సీతారామ ప్రాజెక్టుకు అనుమతులు తీసుకొచ్చామని ఉత్తమ్‌కుమార్ తెలిపారు. సీతారామకు 65 టీఎంసీలు కేటాయిస్తూ త్వరలో అనుమతులు రానున్నాయని తెలిపారు. తమ ప్రయత్నంతోనే ప్రాజెక్టు డీపీఆర్ గోదావరి బోర్డుకు వచ్చిందని వివరించారు. బీఆర్ఎస్ అధికారంలో వచ్చిన నెల రోజులకే గోదావరి జలాలను ప్రారంభించి కేటీఆర్ నెత్తిన నీళ్లు చల్లుకున్నారని, హరీశ్ రావు అది గుర్తు చేస్తున్నారేమోనని మంత్రి ఎద్దేవా చేశారు.

ఏళ్ల తరబడి మోటార్లు, పంపులు పెట్టినా కనీసం విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదన్న ఆయన తాము వచ్చిన తర్వాత పనులు వేగవంతం చేసినట్లు వివరించారు. రూ.19000 కోట్ల ప్రాజెక్టుకు బీఆర్ఎస్? ఖర్చు చేసింది కేవలం 7,436 కోట్లు మాత్రమేనని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతారామపై 500 నుంచి వెయ్యి కోట్ల వరకు ఖర్చు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. బీఆర్ఎస్ మధ్యలో నిలిపివేసిన సీతమ్మ సాగర్?ను కూడా ముందుకు తీసుకెళ్లే విషయాన్ని ఆలోచిస్తున్నామని, సమ్మక్క సాగర్?కు కూడా నీటి కేటాయింపులు లేవని తెలిపారు.

రూ.7300 కోట్లతో 90 శాతం పనులు ఎలా అయ్యాయని ప్రశ్నించిన రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కమిషన్ ఎక్కువ వస్తుందనే మోటార్లు మాత్రం బిగించారని, నీరు ఇవ్వాలన్న చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. నాలుగేళ్లు మోటార్ పెట్టిన తర్వాత డ్రైరన్ కూడా చేయలేదని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లాల్లో బీఆర్ఎస్?ను గెలిపించింది ఒక్క సీట్లో మాత్రమేనని, అది కూడా తన బొమ్మతో తన శిష్యుడు గెలిచారని పొంగులేటి పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నేతలు ముక్కు నేలకు రాసినా ఖమ్మం జిల్లా ప్రజలు మిమ్మల్ని ఎప్పటికీ నమ్మరని, ఇక నుంచి ఖమ్మం జిల్లాలో వచ్చేది బిగ్ జీరో మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా ప్రజలు, గిరిజనుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్?కు లేదని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల పూడిక తీసి మొత్తం చెరువులు నిర్మించినట్లు చెప్పుకొన్నారని, 75 శాతం పూర్తి చేసిన పాలమూరు ప్రాజెక్టులకు రంగులు వేసి ప్రచారం చేసుకున్నారని ఆక్షేపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రతి ఎకరాకు గోదావరి నీళ్లు ఇచ్చి తీరతామని అన్నారు. బొమ్మలతో కాలక్షేపం చేసి పదేళ్లు ప్రజలతో ఆడుకున్నారని తాము చిత్తశుద్ధితో పనిచేసి ఏడాది లోపే నీరు ఇస్తున్నామని పొంగులేటి పేర్కొన్నారు. కృష్ణాకు గోదావరి నీరు తరలించాలని జలయజ్ఞం ద్వారా వైఎస్ హయాంలో టెయిల్ పాండ్ ప్రాజెక్టు ఆలోచన చేశారని తెలిపారు.

ఖమ్మం మంత్రులు, ప్రజల పౌరుషం హరీశ్ రావుకు బాగా తెలుసని ఎంత తక్కువ గోకితే అంత మంచిదని శ్రీనివాసరెడ్డి సూచించారు. అధికారం పోయిన ఎనిమిది నెలలకే బీఆర్ఎస్? నేతలు అతలాకుతలం అవుతున్నారని అధికారం కోసం ఎంత తహతహలాడుతున్నారో అర్థం అవుతోందని వ్యాఖ్యానించారు. మూడు, నాలుగు ఏళ్లు ఓపిక పట్టి మాట్లాడితే బాగుంటుందని సూచించిన ఆయన నెల రోజులు కాకముందే ప్రభుత్వాన్ని కూలుస్తామని అన్నారని గుర్తు చేశారు.

## రీజినల్ రింగ్‌రోడ్డుకు సత్వర భూసేకరణ..

- కలెక్టర్లు సీఎస్ ఆదేశం

బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత నిచ్చి భూసేకరణ పూర్తి చేయాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. సెప్టెంబర్ రెండవ వారంలోగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని సంబందిత జిల్లా కలెక్టర్‌లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు.

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారులు శ్రీనివాస్ రాజు, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవిన్ మిట్టల్, అటవీ శాఖ అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రాష్ట్రంలో అత్యధిక ప్రాముఖ్యత సంతరించుకున్నదని, ప్రాజెక్ట్‌కు సంబంధించి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ

మిగితా 2వ పేజీలో

# బాన్సువాడలో ఉప ఎన్నిక ఖాయం



- పార్టీ మారిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారు.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్

బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ మారిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు నందినగర్ నివాసంలో కేటీఆర్ ను కలిశారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడారు. పోచారం శ్రీనివాస్ రెడ్డినీ అన్ని రకాలుగా గౌరవించిన పార్టీని వీడటం ఆయనకే నష్టమని చెప్పారు. కార్యకర్తల కష్టం మీద గెలిచి ఆ తర్వాత స్వార్థం కోసం పార్టీని వీడటం కార్యకర్తలను బాధించిందన్నారు. ఐతే కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేసిన వాళ్లు ఎంత పెద్ద వాళ్లైనా సరే వదిలిపెట్టేది లేదని వారికి కచ్చితంగా కార్యకర్తలు బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ లోకి వెళ్లిన తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డిని కనీసం అడిగిన వాళ్లు కూడా లేని దయనీయ పరిస్థితి వచ్చిందని చెప్పారు.

రేవంత్ రెడ్డి పరిపాలన సమర్థత ఏంటో ప్రజలకు తెలిసిపోయిందని... మార్పు పేరుతో జనాన్ని ఏమారుస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బాన్సువాడ బై ఎన్నికల్లో కచ్చితంగా పోచారం ను ఓడిస్తామని చెప్పారు. త్వరలోనే ప్రశాంత్ రెడ్డి, ఇతర పార్టీ సీనియర్ నాయకులు సహా తాను బాన్సువాడలో పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పార్టీని మోసం చేసి నాయకులు వెళ్లిపోయినప్పటికీ కార్యకర్తలు మాత్రం పార్టీ వీడలేదని...బీఆర్ఎస్ కు కార్యకర్తలే కొండంత అండ అని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. బై ఎన్నికల్లో కచ్చితంగా పార్టీ మారిన వ్యక్తులకు ప్రజలు బుద్ధి చెబుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. గులాబి జెండా మీద గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ వీడినా... గ్రామాల్లో పార్టీ కార్యకర్తలంతా బిఆర్ఎస్ పార్టీతోనే ఉన్నారని పార్టీ శ్రేణులు కేటీఆర్ కు తెలిపారు.

# నల్ల చెరువును కబ్జా చేస్తే ఊరుకోం



- హైడ్రా కమిషనర్ రంగనాథ్

బలగం టీవి, హైదరాబాద్

హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం ఉప్పల్ నల్లచెరువును పరిశీలించారు. అప్పుడు ఆయనతో పాటు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, వజ్రేశ్ యాదవ్, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ నల్ల చెరువులో కబ్జాలకు పాల్పడితే ఊరుకునేది లేదన్నారు. చెరువులు, నాలాలు, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆక్రమణలను తొలగించడానికి హైడ్రా పనిచేస్తోందని రంగనాథ్ అన్నారు. కబ్జాలను ఏ మాత్రం సహించబోమని హెచ్చరించారు.

# 'పెద్దాపూర్' ఘటన దిగ్భ్రాంతికి గురి చేసింది

- ఇక నుంచి గురుకులాలపై ప్రత్యేక దృష్టి'
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్

పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల మరణం చాలా బాధాకరమని, వీరి మరణం ప్రభుత్వాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 15 రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థుల మరణంతో పాటు నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి, మంగళవారం పాఠశాలను సందర్శించారు.మరణించిన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై మాట్లాడారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో విద్యార్థులను పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంతో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు డిప్యూటీ సీఎం ముందు కన్నీళ్లు పెట్టుకున్నారు. కుమారులను కోల్పోయి కంటతడి పెట్టిన తల్లిదండ్రులను భట్టి ఓదార్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో కలియ తిరుగుతూ సమస్యలు తెలుసుకుని, పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు : రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలన్నీ పూర్తిగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని భట్టి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ కూడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గురుకులాల భవన నిర్మాణాలకు బడ్జెట్?లో రూ.5 వేల కోట్లు కేటాయించామని, పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు పూర్తిగా అందిస్తామన్నారు. పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు కింద రూ.5 లక్షలతో ఇల్లు నిర్మిస్తామని, వారిలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రభుత్వం స్పందించడం సంతోషకరం

- కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్

మరోవైపు ఉపముఖ్యమంత్రి గురుకుల పాఠశాలను సందర్శించడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్'? వేదికగా స్పందించారు. గురుకుల స్కూళ్ల సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం సంతోషకరమని తెలిపారు. గురుకులాల్లో అంతా బాగానే ఉందన్న భావనతో కాంగ్రెస్? సర్కారు ఉందని, తమ ప్రయత్నంతో కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి మేల్కొవడం సంతోషకరమని కేటీఆర్? పేర్కొన్నారు. కేసీఆర్? ప్రభుత్వ హయాంలో 1000కి పైగా గురుకులాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. గురుకులాల్లో ఆహార నాణ్యతను మెరుగుపరిచి విద్యార్థుల జీవితాలను కాపాడేందుకు ముఖ్యమంత్రి అన్ని రకాల చర్యలు చేపట్టాలని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## లాస్ ఏంజిల్స్‌కు ఒలింపిక్ పతాకం

### హాలీవుడ్ నగరంలో ఎగరనున్న ఒలింపిక్ జెండా

బలగం టీవీ, హైదరాబాద

ఒలింపిక్ పతాకం (జెండా) 2028 విశ్వ క్రీడల ఆతిథ్య నగరం లాస్ ఏంజిల్స్‌కు చేరుకుంది. ప్రత్యేక విమానంలో పారిస్ నుంచి బయల్దేరిన లాస్ ఏంజిల్స్ మేయర్, క్రీడా బృందం సోమవారం యుఎస్ఏలో కాలుమోపారు. 'ఎల్ఏ 28' అక్షరాలతో లిఖించిన ప్రత్యేక విమానంలో అమెరికా అథ్లెట్లు, అధికారుల బృందం ఒలింపిక్ జెండాతో లాస్ ఏంజిల్స్‌కు చేరుకున్నారు. హిప్ హాప్ లెజెండ్ షకూర్ 'కాలిఫోర్నియా లవ్' బాణీలను వినిపిస్తుండగా ఒలింపిక్ జెండా లాస్ ఏంజిల్స్‌లో అడుగుపెట్టింది. 2028 ఒలింపిక్స్ సందర్భంగా ఈ ఒలింపిక్ జెండాను లాస్ ఏంజిల్స్ నగరంలో ఎగురవేయనున్నారు.

అతిపెద్ద బాధ్యత : 'ఒలింపిక్ ఆతిథ్యానికి పారిస్ సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ఒలింపిక్ జెండాను అందుకుని ఇక్కడికి రావటం గొప్ప గౌరవం, అతిపెద్ద బాధ్యతగా అనిపించింది. లాస్ ఏంజిల్స్ నగరం ఒలింపిక్స్‌ను గొప్పగా నిర్వహించేందుకు పని చేస్తుండగా.. అమెరికన్ ఆర్గనైజర్స్ కలిసి రావాల్సిన అవసరం ఉంది. ఒలింపిక్స్‌ను పారిస్ గొప్పగా నిర్వహించింది. లాస్ ఏంజిల్స్ నివాసం లేనివారి సమస్యను ఎదుర్కొవాల్సి ఉంది. కానీ లాస్ ఏంజిల్స్‌కు ప్రపంచంలో ఎవరికీ లేని ఆస్తి ఉంది. హాలీవుడ్ సహకారంతో ఒలింపిక్స్‌లో మ్యాజిక్ సృష్టికి అవకాశాలు పుష్కలం' అని లాస్ ఏంజిల్స్ మేయర్ కేరెన్ బాస్ తెలిపారు. ఆధునిక ఒలింపిక్స్‌లో లాస్ ఏంజిల్స్ ఏకంగా మూడోసారి ఆతిథ్యం ఇవ్వనుంది

# పాఠ్యాంశంగా మహిళలపై నేరాలు-శిక్షలు!



- మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క

బలగం టీవీ, హైదరాబాద్

మహిళలను గౌరవించటం, నేరాలు చేస్తే పడే శిక్షలపై చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలని, అందుకోసం పాఠ్యాంశాల్లో ఈ అంశాలను చేర్చాలని మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. దీనికోసం స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాల యంలో మహిళల భద్రతపై ఆమె సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల భద్రత కోసం ఐదు రోజుల స్పెషల్ డ్రైవ్ చేపట్టబోతున్నట్టు తెలిపారు. మహిళా మంత్రులు, ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని వివరించారు. సమాజంలో మహిళల భద్రత కోసం స్వయంసహాయక సంఘాల సహాయాన్ని తీసుకుంటామని, ఆ సంఘ సభ్యులతో గ్రామ స్థాయి నుంచి సోషల్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బాధిత మహిళలు బహిరంగంగా మాట్లాడేలా ధైర్యం కల్పిస్తామని తెలిపారు. వేధింపులకు పాల్పడాలంటేనే భయపడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.

రైతు రుణమాఫీ పూర్తయిన తరువాత గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేస్తామని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం, స్వయం సహాయక సంఘాల బలోపేతం తదితర అంశాలపై జిల్లా పంచా యతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సచివాలయం నుంచి సీతక మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీతక మాట్లాడుతూ.. స్వచ్ఛదనం-పచ్చదనం స్పెషల్‌డ్రైవ్‌లో అనుకున్న ఫలితాలు సాధించినప్పటికీ, శానిటేషన్ మెరుగుపడాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం కోసం మంచి పనితీరు కనబరిచిన సిబ్బందిని స్వాతంత్ర్య దినోత్సవం రోజు సన్మానించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.ప్రతినెలలో మూడు రోజులపాటు స్వచ్ఛదనం-పచ్చదనం డ్రైవ్ కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఆయా జిల్లాల్లో పారిశుద్ధ్య లోపాలపై వార్తలు వస్తున్న నేపథ్యంలో అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.

# ఏసీబీకి చిక్కిన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్

- రూ. 8 లక్షలు లంచం తీసుకుంటూ..

బలగం టీవీ, హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్‌రెడ్డిలు అవినీతి నిరోధకశాఖ అధికారులు పన్నిన వలకు చిక్కారు. ధరణిలో నెలకొన్న సమస్యను తొలగించేందుకు భాదితుడి వద్ద నుండి రూ.8లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు పట్టుకున్నారు. ఈఘటనకు సంబందించి వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యంరెడ్డి అనే వ్యక్తి తనకున్న 14గుంటల భూమిని ధరణి వెబ్‌సైట్‌లో ప్రొహిబిటెడ్ లీస్ట్ నుండి తొలగించాలని కోరాడు. అందుకుగాను సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి ఎనిమిది లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సదరు ముత్యంరెడ్డి ఈ విషయాన్ని ఏసిబి అధికారులకు చేరవేశాడు. సోమవారం రాత్రి 11గం.ల సమయంలో ఓఆర్ఆర్ పరిధిలో భాదితుడు ముత్యంరెడ్డి వద్ద నుండి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి ఎనిమిది లక్షల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు రంగప్రవేశం చేసి అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అయితే అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి ప్రోద్భలంతోనే తాను లంచం డిమాండ్ చేసినట్లు సీనియర్ అసిస్టెంట్ మధన్ మోహన్‌రెడ్డి ఏసిబి అధికారులకు తెలిపాడు. దీంతో ఏసిబి అధికారులు సీనియర్ అసిస్టెంట్ ఫోన్ నుండి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి ఫోన్ చేయించి అతడితో మాట్లాడించారు. పెద్ద అంబర్‌పేట్ అవుటర్ రింగ్‌రోడ్డు వద్దకు డబ్బులు తీసుకురావాలని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డికి తెలిపాడు. ఫోన్ సంభాషణలను విన్న ఏసిబి అధికారులు అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తూ అక్కడికి చేరుకుని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి డబ్బులు ఇస్తుండగా పట్టుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కాగా సోమవారం రాత్రి నుండి భూపాల్‌రెడ్డి నివాసం వద్ద ఏసిబి అధికారులు సోదాలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో ఎసిబి సిటీ రేంజ్ 1 డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు జానకిరామ్ రెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నట్లు సమాచారం.



# సమస్యల వలయంలో గురుకులాలు..

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలోని ఐటీఐ కాలేజీలు, గురుకులాల్లో కనీస వసతులు లేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకపోవడం దుర్మార్గమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. పెద్దపల్లి, సంగారెడ్డి, అదిలాబాద్.. ఇలా రాష్ట్రంలో ఎక్కడి ఐటీఐల పరిస్థితి చూసినా అధ్వాన్నంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పారిశుద్ధ్య నిర్వహణ లేక, టాయిలెట్స్, అవసరమైన సిబ్బంది లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. లైబ్రరీలో కంప్యూటర్లు, ఇతర యంత్రాలు, పనిముట్లు పనిచేయడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయలేకపోతున్నారని వెల్లడించారు. కొన్ని చోట్ల ఐటీఐ తరగతుల్లోకి వాన నీరు చేరి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

ఇక గురుకులాల పరిస్థితి నానాటికీ దిగజారుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కలుషిత ఆహారంతో విద్యార్థుల అస్వస్థత, పాము కాటుకు విద్యార్థి మృతి, డెంగీ జ్వరంతో విద్యార్థి దుర్మరణం వంటి వార్తలు రాష్ట్రంలో నిత్యకృత్యం అయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. అత్యధిక ప్రాంగణాలు దోమలు, ఈగలతో మురికి కూపాలుగా ఉన్నాయని తెలిపారు. స్నానాల గదులకు డోర్లు కూడా లేని పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. సరిపడా బాత్‌రూంలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, పెడుతున్న భోజనం కూడా నాణ్యంగా ఉండటం లేదన్నారు. దిక్కులేక కారం అన్నంతో కడుపులు నింపుకుంటున్నారని చెప్పారు. వాటర్ ట్యాంకులు మురికితో పాకురు పట్టి ఉంటున్నాయని తెలిపారు. ఆ నీటినే విద్యార్థులు స్నానానికి, ఇతర అవసరాలకు వాడుతుండటంతో చర్మవ్యాధుల బారిన పడుతున్నారని వెల్లడించారు.

ఇన్ని సమస్యల మధ్య విద్యార్థులు చదువుపై ఎలా దృష్టి సారిస్తారని ప్రశ్నించారు. గురుకులాల్లో చదివితే విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం అవుతుందని తల్లిదండ్రులు ఎలా నమ్ముతారని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన గురుకులాలు, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దిగజారుతుండటం శోచనీయమని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఐటీఐలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అవసరమైన అన్ని సౌకర్యాలు వెంటనే కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.



# అధికారులు వస్తుంటారు.. పోతుంటారు.. నేను లోకల్

- నాకు కేసులు కొత్త కాదు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై సీఎంకు ఫిర్యాదు చేస్తా
- ఎమ్మెల్యే దానం నాగేందర్

బలగం టీవీ, హైదరాబాద్

కొత్తగా వచ్చిన పదవి ఇష్టం లేనట్లుంది.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై ఎమ్మెల్యే దానం ఫైర్ ఆయనకు కొత్తగా వచ్చిన పదవి ఇష్టం లేనట్లుంది.. అందుకే నాపై కేసు పెట్టాడంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఫైర్ అయ్యారు. ఆయనపై సీఎం రేవంత్ రెడ్డి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. హైదరాబాద్‌లోని నందగిరిహిల్స్ ఘటనలో హైడ్రా ఎమ్మెల్యేపై కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఏవీ రంగనాథ్ నాపై కావాలనే కేసు పెట్టాడు. కొత్తగా వచ్చిన పదవి ఆయనకు ఇష్టం లేనట్లుంది. అందుకే నాపై కేసు పెట్టాడు. సీఎంకు ఫిర్యాదు చేస్తా.

అధికారులు వస్తుంటారు.. పోతుంటారు. కానీ నేను లోకల్. ప్రజాప్రతినిధిగా అక్కడికి వెళ్లే హక్కు నాకుంది. నన్ను అడ్డుకునే అధికారం ఏ అధికారికి లేదు. నందగిరి హిల్స్ హుడా లేఔట్‌లో ప్రజలకు ఇబ్బంది కలుగుతున్నందునే అక్కడికి వెళ్లా. ప్రజా సమస్యలు తీర్చడం ప్రజాప్రతినిధిగా నా బాధ్యత. నాపై కేసు నమోదు విషయాన్ని రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లా. కేసులు నాకు కొత్తేమి కాదు. గతంలో ప్రభుత్వాన్ని ఎదిరించినందుకే నాపై కేసులు పెట్టారు. నందగిరి హిల్స్ ఘటనపై అధికారులకు ప్రివిలేజ్ నోటిసులు పంపిస్తా. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా.' అంటూ అధికారులపై నోరు పారేసుకున్నారు.

**అసలేం జరిగిందంటే..**

ఈ నెల 10న ఎమ్మెల్యే దానం నాగేందర్ జూబ్లీహిల్స్ డివిజన్‌లోని నందగిరిహిల్స్ గురుబ్రహ్మనగర్‌కు చేరుకుని ఆక్రమణదారులను రెచ్చగొట్టారని, ఎమ్మెల్యే సమక్షంలోనే ఆక్రమణదారులు పార్కు గోడను కూల్చి వేసినట్టు జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పాపయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో పాటు.. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ పోలీసులను కోరారు. దీంతో పోలీసులు దానంతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు.



# జర్నలిస్టుల అర్ధనగ్న ప్రదర్శన



బలగం టీవీ, హైదరాబాద్

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ' జర్నలిస్టులకు అది చేస్తాం, ఇది చేస్తాం అని అనుడే తప్ప%%చేసిందేమీ లేదు.' తాజాగా జగిత్యాల జర్నలిస్టులు ఇండ్ల స్థలాల సాధన కోసం విన్నూత్న పంథాను అనుసరించారు. వారు నిరసన చేపట్టి 11 రోజులవుతున్నాయి. అందులో భాగంగానే మంగళవారం వారు ప్లకార్డులతో అర్ధనగ్న ప్రదర్శనను జగిత్యాల పాత బస్టాండ్ లో నిర్వహించారు. ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో అనేక మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.టియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగబద్ధంగా తమకు దక్కాల్సిన హక్కుల కోసమే తాము పోరాడుతున్నామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చే వరకు నిరసన దీక్ష కొనసాగుతుందన్నారు. అవసరమైతే నిరసన కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

# 'ఎప్పుడూ క్రెడిట్ కోసం పాకులాడలేదు'

బలగం టీవీ, హైదరాబాద్



మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వ్యాఖ్యలు తనను బాధించాయని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తాను ప్రచారం కోసమే బటన్ నొక్కే పనులు ఎప్పుడూ చేయలేదన్నారు. ఎప్పుడూ క్రెడిట్ కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. ఎకరం పొలం కూడా తనకు సీతారామ ప్రాజెక్టు కింద లేదన్నారు. హరీశ్ రావు అంటే తనకు ఇష్టమని, ఆయన మాట్లాడే సబ్జెక్ట్, ఆయనకు ఉన్న అవగాహన తనకు ఎంతో నచ్చుతాయని వ్యాఖ్యానించారు. కానీ అలాంటి హరీశ్ రావు తనపట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సీతారామ ప్రాజెక్టు ఘనత కేసీఆర్‌ది అయితే కొంతమంది మంత్రులు తమ ఖాతాలో వేసుకోవడానికి పోటీ పడుతున్నారని నిన్న హరీశ్ రావు విమర్శించారు. ఫ్లెక్సీల నాయకుడని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు.

ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... తాము తప్పు చేసి ఉంటే ప్రజలే బుద్ధి చెబుతారని హరీశ్ రావుకు కౌంటర్ ఇచ్చారు. తనను అవమానించిన వారికి తానేంటో తెలుసునని ఒకింత కన్నీటిపర్యంతమయ్యారు. ఖమ్మం జిల్లాకు గోదావరి నీళ్లు ఇవ్వాలనేది తన సంకల్పం అన్నారు. తాను కట్టిన వంతెనలు, రోడ్లు తనకు పేరు తెచ్చాయని వ్యాఖ్యానించారు. అంతేకానీ తాను ఫ్లెక్సీల నాయకుడిని కాదన్నారు. తాను చేసిన పనులే తన ఫ్లెక్సీ అన్నారు. తాను ఏ ప్రభుత్వంలో పని చేసినా ప్రజల కోసమే పని చేశానన్నారు. తాను ఎన్నికల్లో ఓడిపోతే వ్యవసాయం చేసుకున్నానని తెలిపారు. కానీ ప్రచారం కోసం బటన్ నొక్కే వ్యక్తిని కాదన్నారు.ఉమ్మడి ఏపీలో మంత్రిగా ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణంలో పాల్గొన్నానన్నారు. వాస్తవాలను ప్రజలకు చెప్పాలనే మీడియా సమావేశం పెట్టినట్లు చెప్పారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తన ఆవేదనను చెప్పదలచుకున్నానన్నారు.

భద్రాద్రి శ్రీ రామచంద్రుని దయవల్ల... ఎన్టీఆర్ ఆశీర్వాదంతో వేలాది టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలవుతుంటే.. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనేది తన సంకల్పమన్నారు. నాడు ఉమ్మడి రాష్ట్రంలో బడ్జెట్ ఇబ్బందుల వల్ల దుమ్ముగూడెం కాకుండా దేవాదుల ప్రాజెక్టు చేపట్టామన్నారు. పోలవరం బ్యాక్ వాటర్ ఆధారంగా దుమ్ముగూడెం ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్ట్ చేపట్టాలని కోరానన్నారు. కానీ వైఎస్ అకాల మరణం తర్వాత ఇవి పూర్తి కాలేదన్నారు. తాను నలుగురు ముఖ్యమంత్రుల వద్ద పని చేశానని గుర్తు చేశారు.

తెలంగాణ ఉద్యమ ఫలితంగా టీఆర్ఎస్ (బీఆర్ఎస్) అధికారంలోకి వచ్చిందని, ఆ రోజు ప్రాజెక్టు కోసమే కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్‌లో చేరానన్నారు. కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చాక కేవలం పంప్ హౌస్‌లు మాత్రమే నిర్మాణం చేశారని, రోళ్ళపాడు బయ్యారం అలైన్‌మెంట్ మార్చారని పేర్కొన్నారు. బీజీ కొత్తూరు, పూసు గూడెం, కమలాపురం పంప్ హౌస్‌లు పూర్తి చేయడానికి వాగులు వంకలు వద్ద బ్రిడ్జి నిర్మాణాలు చేయలేదన్నారు. ఆ తర్వాత రాహుల్ గాంధీ పిలుపు మేరకు కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటనలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రతిపాదనలు చేశానన్నారు. అలాగే జూలూరుపాడు టన్నెల్ పూర్తి చేస్తేనే పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి నీళ్లు వస్తాయన్నారు. భగవంతుడు ఇచ్చిన అవకాశంతో వెంసూరుకు తమ్మిలేరుకు, ఎన్టీఆర్ కెనాల్‌తో సాగునీళ్లు అందిస్తున్నట్లు చెప్పారు. అత్యంత కరవు పీడిత ప్రాంతాల్లో 32 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు తానే చేశానన్నారు. పాలేరు కరవుకు శాశ్వత పరిష్కారంగా భక్త రామదాసు లిఫ్ట్ ప్రాజెక్ట్ నిర్మాణం చేశానని, తాను నిర్మాణం చేసిన సాగు నీటి ప్రాజెక్టులపై రైతాంగం సంతోషంగా ఉన్నారని తెలిపారు.

# వైద్య సేవలు అందించడంలో అలసత్వం ప్రదర్శించవద్దు..



- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి..
- డెంగ్యూ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**
వైద్యం కోసం వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో అలసత్వం ప్రదర్శించవద్దని, వారితో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని వైద్యులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం పీఎస్ నగర్ లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా చేశారు.ఔట్ పేషెంట్ రిజిష్టర్, ల్యాబ్, ఫార్మసీ, ఇన్ పేషెంట్ బెడ్స్, తదితర వాటిని పరిశీలించారు.

ప్రతీరోజూ ఎంత మంది రోగులు ఆరోగ్య కేంద్రానికి వస్తారు..? ఎలా వైద్యం అందిస్తారు..? ఎన్ని శాంపిల్స్ ను టీ హబ్ కు పంపిస్తారు అనే వివరాలను సంబంధిత మెడికల్ ఆఫీసర్ ను అడిగి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన, పారదర్శకమైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు . క్షేత్ర స్థాయిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.డెంగ్యూ కేసులపై కలెక్టర్ ఆరా తీశారు, ఎన్ని కేసులు రిజిష్టర్ అయ్యాయి,ఎంత మంది మెరుగయ్యారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న ఏఎన్ఎం లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, క్రమం తప్పకుండా ఏఎన్సీ చెకప్ లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో మెడికల్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న, సిబ్బంది ఉన్నారు.



# బీసీ గురుకుల హాస్టల్ లో ఏసీబీ రైడ్స్

**బలగం టీవీ , సిరిసిల్ల :**
సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఏసీబీ డీఎస్పీ ఉదయ్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.వివిధ శాఖల అధికారులతో కలిసి ఏసీబీ అధికారుల బృందం తనిఖీలను ప్రారంభించారు.కొన్న ఫర్నిచర్, సరుకులు, ఇతర వస్తువుల వివరాలను నమో దు చేసుకున్నారు. అదేవిధంగా స్టూడెంట్స్, టీచర్లు, అటెండెన్స్ పరిశీలించారు. కాలేజీకి సంబంధించిన పలు లావాదేవీలపై ఆరా తీశారు వసతి గృహంలో సౌకర్యాలు ,ఆహారంపై పూర్తిస్థాయి పరిశీలన న చేపట్టారు. ఈ తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

# పౌరుల హక్కుల రక్షణ న్యాయవాదుల బాధ్యత



- సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల సంజీవ రెడ్డి, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం
- న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష..

**బలగం టీవీ , సిరిసిల్ల :**
కోర్టు ఉత్తర్వులలో రాజన్న సిరిసిల్ల పోలీసుల జోక్యాన్ని నిరసిస్తూ సిరిసిల్ల,వేములవాడ న్యాయ వాదులు, గత 13 రోజులు గా కోర్టు విధులు బహిష్కరించగా, మంగళవారం నుండి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ,సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల సంజీవ రెడ్డి, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ కక్షి దారుల హక్కులు కాపాడేందుకు కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ ఇప్పించిన, ఇంజక్షన్ ఆర్డర్ ను పోలీసులు బేకాతరు చేస్తూ, ఇంజక్షన్ ఆర్డర్ ఉన్న వారి పైన నే రాజన్న సిరిసిల్ల పోలీస్ లు అక్రమ కేసులు పెడుతున్నారు అని అన్నారు.పౌరుల హక్కుల రక్షణ న్యాయ వాదుల బాధ్యత అని అన్నారు.ఈ దీక్షలో న్యాయ వాదులు.బొంపెల్లి రవీందర్ , తంగళ్ల పల్లి వెంకటి ,కటకం జనార్దన్ ,గుండెల్లి శశాంఖం,కంసాని రాజేష్ ,ఆ. శుష్మ,నిషాదు, సీనియర్ న్యాయ వాదులు ఉమా శంకర్,వసంతం,నాగుల సత్యానారాయణ, ధర్మందర్,కోడం సురేష్,,రామ కాంతారావు,గోవింద్ భాస్కర్,తీర్మాల్ గౌడు, వేణు, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జెండా ను ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్

- ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ

**బలగం టీవీ ,సిరిసిల్ల:**
భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం సిరిసిల్ల జూనియర్ కాలేజి గ్రౌండ్ లో ఆవిష్కరించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి జారీ అయిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# మహా చండీయాగ నిర్వహణ ఏర్పాట్ల పరిశీలన..



**బలగం టీవీ , సిరిసిల్ల :**
శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయ ఆధ్వర్యంలో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ఈనెల 16,17 మరియు 18 వ తేదీలలో నిర్వహించనున్న మహా చండీయాగ ఏర్పాట్లను సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ , బిఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి లు పరిశీలించారు.ఈ కార్యక్రమం లో పద్మశాలి కళ్యాణ భవన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్ , చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గుజ్జే తార, సిరిసిల్ల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గాజుల బాలయ్య, బొజ్జ శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు..

# స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక అతిథులుగా..

**బలగం టీవీ , న్యూఢిల్లీ**
ఎర్రకోటలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 78వ స్వాతంత్ర్య వేడుకలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారిలో కొందరిని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అతిథులుగా ఆహ్వానిస్తోంది. పంచాయతీరాజ్ సంస్థల నుంచి దాదాపు 400 మంది మహిళా ప్రతినిధులు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నారు. అలాగే 45 మంది లాఖ్‌పతి దీదీలు, 30 మంది డ్రోన్ దీదీలు హాజరవుతారు. వీరికోసం బుధవారం ప్రత్యేకంగా జాతీయ వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్, నవజ్యోతి ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కిరణ్ భేడీతోపాటు పలు శాఖల అధికారులు పాల్గొనున్నారు. స్వయం సహాయక సంఘ్ (ఎస్‌హెచ్‌జీ) కింద మహిళలకు వివిధ రకాల నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి వారు ఏడాదికి కనీసం రూ. లక్ష స్థిర ఆదాయం పొందడమే లాఖ్‌పతి దీదీ పథకం. ఎస్‌హెచ్‌జీ ల్లోని మహిళలకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇవ్వడమే డ్రోన్ దీదీ పథకం.



# ట్యాంక్ బండ్‌లో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

**బలగం టీవీ , హైదరాబాద్**
ఓ మహిళ ట్యాంక్‌బండ్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, ట్యాంక్ బండ్ శివ కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. వెంటనే ట్యాంక్ బండ్ శివ హుస్సేన్ సాగర్‌లోకి దూకి మహిళను బయటకు తీసుకొచ్చారు. ఆమె ప్రాణాలతో ఉండడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.

# వేణుస్వామికి మహిళా కమిషన్ నోటీసులు



**బలగం టీవీ , హైదరాబాద్**
ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామికి తెలంగాణ మహిళా కమిషన్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. నాగచైతన్య, శోభిత ధూళిపాళ విడిపోతారంటూ చేసిన వ్యాఖ్యలపై నోటీసులు ఇచ్చింది. ఈ నెల 22న మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. మరో వైపు వేణుస్వామికి మద్దతుగా ఆయన భార్య వీణా వాణి వీడియో విడుదల చేసింది. మీడియాపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల నాగచైతన్య, శోభిత ధూళిపాళ నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత వేణుస్వామి జాతకాలను విశ్లేషణ చేస్తూ చేసిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. 2027లో ఇద్దరు విడిపోతారంటూ వ్యాఖ్యానించారు. గతంలో సమంత, నాగ చైతన్య జంట సైతం విడిపోతారంటూ బయటపెట్టారు. ఆ తర్వాత పలు విషయాలపై జాతకాలు చెప్పినా ఏ ఒక్కటి జరుగలేదు.

ఇదిలా ఉండగా.. వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలంటూ తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. గతంలో సినిమాల విడుదల, రాజకీయాలు ఇలాంటి వ్యాఖ్యలు చేసి అభాసుపాలైనా ఆయనకు బుద్ధి రాలేదని.. వ్యక్తిగత విషయాలపై నలుగురిలో మాట్లాడకూడదనే జ్ఞానం లేకుండా వేణుస్వామి వాళ్లు విడిపోతారంటూ వ్యాఖ్యాని స్తున్నారని విమర్శించారు. దీనికి స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద వేణుస్వామిని పిలిపించి వివరణ కోరుతామని పేర్కొన్నారు. టెలికాస్ట్ చేసిన యూట్యూబ్ ఛానెల్స్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే వేణుస్వామికి మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది.

## టోల్ ఛార్జీల పేరుతో

# ప్రతి నెలా రూ.5వేల కోట్లు వసూలు



**బలగం టీవీ , న్యూఢిల్లీ**
టోల్ ఛార్జీల గత ఏడాది సరాసరి నెలకు 5వేల కోట్ల టోల్ వసూలు అవుతోంది. ఫాస్టాగ్ ద్వారా 2023- 24 ఆర్థిక సంవత్సరంలో నెలకు రూ. 5వేల కోట్లు వసూలు అయ్యాయని రోడ్డు రవాణా, రహదారులు మంత్రిత్వ శాఖ వార్షిక నివేదికలో తెలిపింది. రోడ్డు రవాణా రహదారులు మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం టోల్ వసూళ్లు రూ. 64వేల కోట్లకు పైగా వచ్చాయి. 2024 మార్చి నెలలో అత్యధికంగా 5వేల 911 కోట్లు వసూలు అయ్యాయి. అత్యల్పంగా జూలై 2023లో 4వేల 966 కోట్లు వసూలు చేసినట్లు తెలిపింది. 2022 డిసెంబర్ లో అత్యధికంగా 4వేల 918 కోట్లు వసూలు కాగా అంతకుముందు 2021 డిసెంబర్ లో రూ. 3వేల 674 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి. మార్చి31, 2024 నాటికి 8.81 కోట్లు ఫాస్టాగ్‌లను జారీ చేశారు. ఈటీసీ ద్వారా రోజువారీ సగటు వసూళ్లు మొత్తం 98.5 శాతం పెరిగి రూ.190.67 కోట్లకు చేరాయి.

మొత్తం 1365 జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల టోల్ ప్లాజాలు ఉన్నాయి. ఆగస్టు జూలై 2023 నాటికి 98 శాతం నుంచి 99 శాతం టోల్ వసూలు మెరుగుపడింది. జాతీయ రహదారులపై టోల్ వసూళ్లలో స్థిరమైన పెరుగుదల ఉంది. దీనికి కారణం టోల్ సేకరణ ఎలక్ట్రానిక్ ఫాస్టాగ్ కి మారడమే మంత్రిత్వ శాఖ చెపుతోంది. ట్రాఫిక్ పెరగడం, టోల్ ఫీ రేట్లలో మార్పులు, కొత్త టోల్ రహదారుల పొడవును పెంచడం వంటివి టోల్ సేకరణ పెరుగుదలకు ఇతర కారణాలని చెప్పింది. 2015 నుంచి 2023 మధ్య కాలంలో దేశం అంతగా టోల్ వసూలు మూడు రెట్లు పెరిగింది. 2015లో రూ. 17వేల 759 కోట్లుండగా 2023లో 48వేల 028 కోట్లకు పెరిగింది. ఫాస్టాగ్ ట్రాఫిక్ అతుకులు లేకుండా ఉండేలా వాహనదారుల నుంచి వసూళ్లలో పారదర్శకత పెంచడం కోసం నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ కార్యక్రమం అమలు చేస్తున్నామని కేంద్ర రోడ్డు రవాణ, రహదారులు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో 40 ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు కలిసి పనిచేస్తున్నాయి. ప్లాజా లావాదేవీల ప్రాసెస్ చేయడానికి 14 అక్వైరర్ బ్యాంకులు పనిచేస్తున్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

# 3.34 కిలోల గంజాయి పట్టివేత



**బలగం టీవీ , హైదరాబాద్**
గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ జూపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం సాయంత్రం రాంపల్లి- చెంగిచెర్ల రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో వస్తున్న బైక్‌ను ఆపి సోదా చేశారు. అందులో 3.34 కిలోల గంజాయిని గుర్తించారు. వరంగల్ జిల్లా నర్సింహులుపేట, దుబ్బతండాకు చెందిన జటోతు రమేష్ మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లిలో ఉంటు న్నాడు. ఇతడు గతంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. ఆ తర్వాత గంజాయి విక్రయాలు మొదలుపెట్టాడు. తక్కువ ధరకు ఒడిస్సా సరిహద్దు నుంచి గంజాయిని తీసుకొచ్చి రాంపల్లి, ఈసీఐఎల్ ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు అతడి వద్ద నుంచి గంజాయితో పాటు బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జటోతు రమేషను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.



# కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు

**బలగం టీవీ , హైదరాబాద్**
ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీని సెప్టెంబర్ 2వ తేదీ వరకూ ఢిల్లీ కోర్టు మంగళవారం పొడిగించింది. ఇంతకుముందు కోర్టు విధించిన జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీని పొడిగిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బజ్వా ఆదేశాలు జారీ చేశారు.

# వినేశ్ ఫొగాట్ అప్పీల్‌పై తీర్పు వాయిదా



బలగం టీవీ, హైదరాబాద్

పారిస్ ఒలింపిక్స్‌లో తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాలు చేసిన రెజ్లర్ వినేశ్ ఫొగాట్ కేసు మరోసారి వాయిదా పడింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడ్డ ఈ కేసు తాజాగా ఆగస్టు 16కు వాయిదా వేశారు. మరోవైపు తీర్పు వెలువడనున్న నేపథ్యంలో వినేశ్ ఇంకా స్వదేశానికి బయలుదేరలేదు. త్వరలో ఆమె భారత్‌కు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం తన లగేజీని తీసుకొని ఒలింపిక్ క్రీడాగ్రామం నుంచి వినేశ్ బయటికి వచ్చిన సంగతి తెలిసిందే.

ఇక ఈ కేసులో వినేశ్ తరపున వాదించిన ఇద్దరు సీనియర్ లాయర్లలో ఒకరైన విదుష్పత్ సింఘానియా తాజాగా మీడియాతో మాట్లాడారు. "ఇది మాకు చాలా కష్టమైన పని. ఎందుకంటే మా అభిప్రాయాలను సిద్ధం చేయడానికి, వాటిని కాస్ ముందుంచడానికి మాకు చాలా తక్కువ సమయమే ఉంది. కానీ, మేము కష్టపడి పనిచేసి వినేశ్ కోసం పోరాడటానికి సిద్ధంగా ఉన్నాం. సాధారణంగా కాస్ 24 గంటల్లో తీర్పు ఇస్తుంది. అయితే ఈసారి వారు తీర్పు గడువును ఒకటి కంటే ఎక్కువసార్లు పొడిగించారు. అయితే నిర్ణయం మాత్రం భారత్‌కు అనుకూలంగా వస్తుందని మేమందరం ఆశిస్తున్నాం. ఇక తీర్పు ఇచ్చే ఏడీహెచ్‌ఓసీ ప్యానెల్ 24 గంటల టైమ్ లిమిట్‌ను కలిగి ఉంది. దీన్నిబట్టి ఈ అంశం గురించి ప్యానెల్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు మాకు బాగా అర్థమవుతోంది. జడ్జీ మహిళ అయితే మాకు ఇంకా మంచిది. గతంలో నేను ఎన్నో కేసులు వాదించాను. కానీ ఈ విషయంలో సక్సెస్ రేటు చాలా తక్కువ. అందుకే వినేశ్ విషయంలో చరిత్రాత్మక తీర్పు ఇవ్వాలని జడ్జిని కోరుతున్నాం. ఇది కొంచెం కష్టమే అయినప్పటికీ ఏదైనా సరే అద్భుతం జరగాలని కోరుకుం టున్నాను. వినేశ్‌కు సిల్వర్ మెడల్ దక్కాలని అందరూ ప్రార్థిం చండి. ఒకవేళ మెడల్ రాకపోయినా కూడా ఆమె ఛాంపియనే" అంటూ న్యాయవాది విదుష్పత్ సింఘానియా పేర్కొన్నారు.

# ఇంగ్లండ్ కోచ్‌గా సంగక్కర..!




బలగం టీవీ, హైదరాబాద్

శ్రీలంక లెజెండ్ కుమార సంగక్కర ఇంగ్లండ్ జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఇంగ్లీష్ టీమ్ వైట్ బాల్ కోచ్‌గా సంగక్కర ఎంపికయ్యాడని సమాచారం. ఈమధ్యే రాజీనామా చేసిన మాథ్యూ మాట్ స్థానంలో సంగక్కర టీ20, వన్డే కోచ్‌గా సేవలందించనున్నాడు. అయితే ఈ విషయాన్ని ఈసీబీ అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. ఇంగ్లండ్‌ను టీ20 చాంపియన్‌గా నిలిపిన మ్యాట్ ఈసారి మ్యాజిక్ చేయలేకపోయాడు. కరీబియన్ గడ్డపై జరిగిన పొట్టి ప్రపంచకప్‌లో జోస్ బట్లర్ సేన వైఫల్యంతో అతడు కోచ్ పదవి నుంచి వైదొలిగాడు. అప్పటి నుంచి ఇంగ్లండ్ బోర్డు కొత్త కోచ్ వేటను మొదలెట్టింది. ఆస్ట్రేలియా దిగ్గజం మైక్ హస్సీ, జింబాబ్వే మాజీ కెప్టెన్ ఆండీ ఫ్లవర్ పేర్లను పరిశీలించిన ఈసీబీ చివరకు సంగక్కరను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఐపీఎల్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్, జో రూట్‌లు కొంతకాలంగా రాజస్థాన్‌కు ఆడారు. ఆ సమయంలో వీళ్లు సంగక్కర పనితీరును గమనించారు. కోచ్‌గా సంగక్కర పేరు ప్రస్తావనకు వచ్చినప్పుడు ఈ ఇద్దరూ ఓకే అని ఉండి ఉంటారు. లంక మాజీ సారథి అయిన సంగక్కరకు అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ అనుభవం ఉంది. ప్రపంచలోని మేటి క్రికెటర్లలో ఒకడైన ఈ లెఫ్ట్ హ్యాండర్ ఐపీఎల్‌లో డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా తన ముద్ర వేశాడు. 2021లో రాజస్థాన్ రాయల్స్‌తో కొనసాగుతున్న అతడు జట్టును అదే ఏడాది ఫైనల్‌కు తీసుకెళ్లాడు.

# సరిపోదా శనివారం ట్రైలర్ వచ్చేసింది



బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని నుంచి వస్తోన్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం' . వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో గ్యాంగ్‌లీడర్ ఫేం ప్రియాంక అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో మేకర్స్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్‌ను సుదర్శన్ 35 థియేటర్‌లో రిలీజ్ చేశారు. నాని నుంచి అభిమానులు కోరుకునే అన్ని ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్ ద్వారా హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీలో ఎస్‌జే సూర్య కీలక పాత్ర పోషిస్తున్నాడు. జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వస్తోన్న ఈ మూవీ ఇతర భాషల్లో Suryas Saturday టైటిల్‌తో రిలీజ్ కానుంది.

# ఏ, బీ, సీ, డీ జట్లతో దులిప్ ట్రోఫీ ..!




● కెప్టెన్లుగా రోహిత్, గిల్, పంత్, బుమ్రా.

బలగం టీవీ, హైదరాబాద్

శ్రీలంక పర్యటన తర్వాత టీమిండియాకు లాంగ్ బ్రేక్ లభించింది. 42 రోజుల అనంతరం మళ్లీ అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. బంగ్లాదేశ్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌తో టీమిండియా క్రికెట్ షెడ్యూల్ పున: ప్రారంభం కానుంది. వచ్చే నాలుగు నెలల్లో టీమిండియా 10 టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. దాంతో అత్యుత్త టెస్ట్ టీమ్‌ను ఎంపిక చేసేందుకు టీమిండియా మేనేజ్‌మెంట్, సెలెక్టర్లు మాస్టర్ ప్లాన్ రచించారు. అందుకు ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నీ దులిప్ ట్రోఫీ 2024ని ఉపయోగించుకోవాలనుకుంటున్నారు. ఇప్పటికే టీమిండియా స్టార్ ఆటగాళ్లందరిని దులిప్ ట్రోఫీ ఆడాలని ఆదేశించారు. కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ తదితర ఆటగాళ్లంతా దేశవాళీ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇవ్వనున్నారు.

సాధారణంగా దులిప్ ట్రోఫీలో ఈస్ట్, సౌత్, నార్త్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్, నార్త్ ఈస్ట్ జోన్స్ ఆడుతాయి. కానీ ఈసారి సెలెక్టర్లు ఈ టోర్నీని నాలుగు జట్లతోనే ఆడించాలనుకున్నట్లు తెలుస్తోంది. భారత సీనియర్, భారత్–ఏ ఆటగాళ్లతో పాటు రంజీ క్రికెట్‌లో సత్తా చాటిన డొమెస్టిక్ క్రికెటర్లతో కలిపి ఏ, బీ, సీ, డీ జట్లతో ఈ టోర్నీని నిర్వహించాలని అజిత్ అగార్క్ సారథ్యంలోని సెలక్షన్ కమిటీ నిర్ణయించినట్లు సమాచారం. ఈ టోర్నీ ద్వారా భారత ఆటగాళ్లకు సరైన మ్యాచ్ ప్రాక్టీస్ అందించడంతో పాటు.. అత్యుత్తమ టాలెంట్‌ను బయటకు తీయాలని అజిత్ అగార్కర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ భావిస్తున్నారంట. ఈ టోర్నీలో పాల్గొనే నాలుగు జట్లకు రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ కెప్టెన్లుగా వ్యవహరించే అవకాశం ఉంది.

నాలుగు జట్లకు అవసరమయ్యే ఓపెనర్లు, మిడిలార్డర్ బ్యాటర్లు, వికెట్ కీపర్లు, ఆల్‌రౌండర్లు, స్పిన్నర్లతో పాటు పేసర్లను ఎంపిక చేయడంపై భారత సెలెక్షన్ కమిటీ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఈ టోర్నీ ద్వారా దేశవాళీ ఆటగాళ్లకు కూడా సీనియర్లతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకునే అవకాశం లభించనుంది. బీసీసీఐ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఈ టోర్నీ సెప్టెంబర్ 5 నుంచి 24 వరకు జరగాల్సి ఉంది. అయితే టోర్నీని నాలుగు జట్లకు కుదిస్తే.. షెడ్యూల్‌లో కూడా స్వల్ప మార్పులు జరగనున్నాయి. సెప్టెంబర్ 19 నుంచి బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో దులిప్ ట్రోఫీని ఇంకాస్త ముందుగానే ముగించే అవకాశం ఉంది. అయితే ఈ టోర్నీ నిర్వహణ గురించి బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## నేటి సాయంత్రం నుంచి
# ఇరగదీయనున్న 'మిస్టర్ బచ్చన్'




బలగం టీవీ, హైదరాబాద్

మాస్ మహారాజా రవితేజ, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ 'మిస్టర్ బచ్చన్' ఈ నెల 15న విడుదల కానుంది. ప్రతిష్టాత్మక పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై అత్యద్భుతమైన గ్రాండియర్‌తో నిర్మాత టి.జి.విశ్వ ప్రసాద్ ఈ సినిమాని నిర్మించారు. ఇందులో రవితేజకు జోడీగా భాగ్యశ్రీ బోర్సే నటించింది. ఆగస్ట్ 14 సాయంత్రం నుంచి ప్రిమియర్స్ ఉండబోతున్నాయి. ఈ నేపథ్యంలో కర్నూల్ లో మిస్టర్ బచ్చన్ ప్రీరిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా నిర్వహించారు.

ప్రీరిలీజ్ ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ.. ఈ సినిమా అంత కలర్ ఫుల్‌గా ఉండబోతోంది. ఈ సినిమాలో నేను, భాగ్యశ్రీ అందంగా కనిపించబోతున్నాం. మిక్కీ జే మేయర్ నుంచి ఇలాంటి మ్యూజిక్ వస్తుందని ఊహించలేదు. ఒకరకంగా షాక్ ఇచ్చినట్లే. ఫస్ట్ టైం ట్యూన్స్ వినిపించినపుడు ఇది మిక్కీనా అనిపించింది. విశ్వ గారు, వివేక్ గారు బాగా దగ్గర. వారు ఇలాంటి సినిమాలు తీస్తూనే ఉండాలన్నారు. ఇక భాగ్యశ్రీ ఇప్పటికే ఊపు ఊపేస్తుంది. తనే డబ్బింగ్ చెప్పింది. సినిమాలో మీ అందరికీ ఇంకా నచ్చుతుందన్నారు. ఈ సినిమాకు హరీష్ చాలా హార్డ్ వర్క్ చేశాడు ఈ సినిమా కూడా పెద్ద బ్లాక్ బస్టర్ అవ్వాలన్నారు. మిస్టర్ బచ్చన్ 14వ తారీకు సాయంత్రం నుంచి ఇరగదీయబోతోందన్నారు.

డైరెక్టర్ హరీష్ శంకర్ మాట్లాడుతూ.. ఈ ఈవెంట్ చూస్తుంటే కత్తిలాంటి కుర్రాళ్ళు కర్నూల్ లోనే ఉన్నారా అనిపిస్తుంది. నా రైటింగ్ టీం, భాస్కర్ బట్ల,వనమాలి, కాసర్ల శ్యాం, సాహితి గారికి థాంక్ యూ. ఈ సినిమాకి ప్రవీణ్ వర్మ అద్భుతమైన డైలాగులు రాశారు. ఆగస్ట్ 15 మా గురువు గారు పూరి జగన్నాథ్ గారు, రామ్ డబుల్ ఇస్మార్ట్ వస్తోంది. ఈ రెండు సినిమాలు చూడండి. రెండు సినిమాలని బ్లాక్ బస్టర్ చేయండన్నారు.

భాగ్యశ్రీ హార్డ్ వర్కింగ్ హీరోయిన్. తనకి చాలా బ్రైట్ ఫ్యూచర్ ఉంటుందన్నారు. గతంలో మిరపకాయ్ టైటిల్ రవితేజ గారే పెట్టారు. మిస్టర్ బచ్చన్ టైటిల్ పెట్టింది కూడా ఆయనే. జీవితాన్ని ఇచ్చి, సినిమాలు ఇచ్చి, ఆఖరికి టైటిల్స్ కూడా ఇచ్చారన్నారు (నవ్వుతూ). ఆయన లేకుండా నా ఫిల్మ్ కెరీర్ ని ఊహించలేను. వన్ మంత్ లో నాలుగు చార్ట్ బస్టర్ సాంగ్స్ చేశారు మిక్కీ జే మేయర్. మా ఇద్దరిదీ డెడ్లీ కాంబినేషన్. మా సినిమాని సపోర్ట్ చేసిన అందరికీ థాంక్ యూ సో మచ్. మిస్టర్ బచ్చన్ రిపీట్ ఆడియన్స్ ఉండే సినిమా.'అన్నారు.

హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ.. మూవీ రిలీజ్ కి ముందే మీరంతా ఎంతో ప్రేమని చూపించారు. అందరికీ థాంక్ యు. రవితేజ చాలా సపోర్ట్ చేశారు. మాస్ మహారాణిలానే చూశారు. ఆయన నా ఫస్ట్ కో స్టార్ కావడం చాలా ఆనందంగా ఉందన్నారు.ప్రొడ్యూసర్ టి.జి.విశ్వ ప్రసాద్, సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల మాట్లాడుతూ.. మూడోసారి కలసి పని చేసే అవకాశం ఇచ్చిన రవితేజ గారికి థాంక్ యూ వెరీ మచ్. హరీష్ శంకర్ తను చేస్తున్న సినిమా నుంచి కొద్దిగా బ్రేక్ తీసుకొని ఈ సినిమా చేయడానికి పర్మిషన్ ఇచ్చిన పవన్ కళ్యాణ్ గారికి థాంక్ యూ. మిస్టర్ బచ్చన్ ఇప్పటివరకూ చూసిన పాటలే కాకుండా ఇంకా ఎక్స్ట్రా సర్ప్రైజింగ్ ఎలిమెంట్స్ తో ఫుల్ మాస్ ఎంటర్ టైనర్ గా సక్సెస్ అవుతుందని